


# పరదేశీ కథలు

- చిట్టే సిద్ధ లలిత



-77 -

## ఎడారిలో ఒయాసిస్సు షేకా

**రెండురోజులుగా** అక్కడే బాత్ రూములోని నేలపైనే పడి వుంది గౌరి. వంటికి తగిలిన దెబ్బలన్నీ సలుపుతున్నాయి. కదిలితే బాధగా వుంది. మొహమంతా వాచిపోయింది. కుడికన్నుకు దెబ్బ బాగా తగిలినట్లుంది. ఆ కన్ను పూర్తిగా మూసుకుపోయింది. గోడవైపుకు ముడుచుకు పడుకుని తన దుస్థితికి విలపిస్తోందామె.

ఏడుపు బయటికి వినబడితే మామా వచ్చి ఇంకో పదిదెబ్బలు కొడుతుందని తెలుసు అందుకే నిశ్శబ్దంగా ఏడుస్తోంది గౌరి.

పట్టుమని పాతికేళ్ళు లేవు. తన బ్రతుకుకు ఎన్ని కష్టాలో. ఎక్కడా సుఖమనేదే లేదు. కువైట్ లోనైనా పని చేసుకుని బతుకుదామని వస్తే ఇక్కడ ఇల్లు మంచిది కాదు. వచ్చినప్పటినుండీ చిన్నవిషయానికే వేధిస్తున్నారు. నోరెత్తి మాట్లాడితే వళ్ళంతా నలగ్గొట్టి బాధిస్తున్నారు. గల్ఫ్ దేశాలంటే సుందరమైనవని, సౌకర్యాలను సమకూర్చుతాయని, పనికి తగిన జీతం లభిస్తుందని విన్నదే కానీ దుర్మార్గులైన ఇలాంటి యజమానులు కూడా వుంటారని ఊహించలేదు. చిన్న విషయానికే చావగొడుతున్నారు. ఇలా అయితే ఇక్కడ బ్రతకడం చాలా కష్టం. ఇప్పటికే అతికష్టం మీద ఆర్నెల్లు గడిచింది. ఈ ఆర్నెల్లలో అరవైసార్లయినా కొట్టి వుంటారు. ఇంకా కోపంవస్తే తిండికూడా పెట్టకుండా నాల్రోజులు బాత్ రూంలో తోసి తాళం వేసేస్తారు. దాహమేస్తే ఆ బాత్ రూంలో నీళ్ళే తాగి ప్రాణాలను నిలబెట్టుకోవాల్సి వస్తోంది. అయినా ఏమంత తప్పుచేసిందని. డ్రైవర్ వంటింటిగుమ్మం దగ్గరికివచ్చి బాటిల్లో నీళ్ళిమ్మని అడిగాడు. నీళ్ళిస్తూ తెలుగువాడే కదా అని రెండుమాటలు మాట్లాడింది. ఆ సమయంలో వంటింట్లో పని హడావిడిలో వుండి గమనించలేదు. తన నెత్తిమీద హిజాబ్ తల మీదనుండి జారిపోయి మెడమీద వేలాడుతోంది. అంతే. ఇంతలో మామావచ్చి చూసి రాక్షసిలా విరుచుకు పడింది.

"ఏమే తలమీద గుడ్డ కూడా కప్పుకోకుండా పరాయి మగాడితో ఆ వికవికలు ఏంటి బాబాముందు కూడా ఇలాగే

వేషాలు వేస్తావా" అంటూ కాలికున్న స్లిప్పర్స్ తీసి చెంపలపైన చెళ్ళుమని కొట్టింది.
అంతటితో ఆగకుండా "నీకు జుట్టు పొడవుగా వుందని నీ అందాన్నంతా మగాళ్ళకి చూపిస్తు వాళ్ళ మతి చెడగొడుతున్నావా. నేనెన్నిసార్లు చెప్పాను. మగాళ్ళకు నీ తలవెంట్రుకలు కనపడకూడదని" అంటూ కత్తెర తీసుకొచ్చి జడమొత్తం మొదటికి కత్తిరించి గౌరిని లాక్కెళ్ళి బాత్ రూంలో తోసి బయట గడియ వేసింది.
తనతోపాటూ పని చేస్తున్న మేరీ మంచిది కాబట్టి అపుడపుడూ మామా బాబా చూడనప్పుడు కాస్త కుబూజ్ (రొట్టెముక్కను) లోపలికి పడేస్తోంది. అది తిని ప్రాణం నిలబెట్టుకోవలసి వస్తోంది. ఇంటిదగ్గర వదిలి వచ్చిన రెండేళ్ళపాప గుర్తుకు వస్తే దు:ఖం రెట్టింపవుతోందామెకు. చాటుగా మామా బాబా చూడకుండా తనను ఈ ఇంట్లో పనికి పెట్టిన ఏజెంటుకు ఫోన్ చేసి విషయంచెప్పి కాపాడమని వేడుకుంటే వాడు తననే తిడుతున్నాడు.
"మీరుఇండియానుండి కువైట్ కు వచ్చింది ఎందుకు. కష్టమయినా భరించి పని జెయ్యాల పైసల్ సంపాదించాలె. ఊరికే కూర్చుంటే పైసల్ వస్తాయా ఇక్కడ. రాసుకున్న కాంటాక్ట్ ప్రకారం రెండేళ్ళు పని ఖచ్చితంగా చెయ్యాల. లేకపోతే కువైటీ వాళ్ళు వప్పుకోరంటూ" కోపంగా మాట్లాడుతున్నాడు.
రెండేళ్ళ కాంటాక్ట్ పూర్తిగా ముగించకుండా ఎంత మొత్తుకున్నా వీళ్ళు ఇంటికి పంపించరట. అంతవరకూ తను ప్రాణంతో వుంటుందా. ఇక్కడే చచ్చిపోయి తన శవం ఇల్లు చేరుతుందా. ఇంతకీ శవాన్నయినా ఇండియాకు పంపిస్తారా? ఆమాత్రం జాలి దయా వీళ్ళకున్నాయా.అతికష్టం మీద ఓర్చుకుంటూ ఆర్నెల్ల కాలాన్ని గడిపింది. ఇక వీళ్ళుకొట్టే దెబ్బలను ఏ మాత్రం భరించే స్థితిలో లేదు. ఇపుడేం చెయ్యాలి. ఏదో ఒకవిధంగా ఇక్కడనుండి బయటపడాలి. మూడురోజులు గడిచాక ఆ రోజు తలుపు తీసింది మామా.
"నీ కొవ్వు కరిగిందా లేదా? ఇంకొక్కసారి మగాళ్ళకు వళ్ళు చూపిస్తూ వల్లో వేసుకుందామని ప్రయత్నించావంటే చూడు నీ పని చెప్తా. గుండు కొట్టించి ఇండియాకు పంపిస్తా. ఆడోళ్ళు ఇలా వంటిమీద బట్టలేకుండా మగాళ్ళని ఆకర్షించాలని తిరుగుతున్నారు కాబట్టే పాపం మగాళ్ళు వాళ్ళ తప్పేముంది, కోరిక తీర్చుకోవడానికి ఆడదాని శరీరంకోసం ఎగబడుతున్నారు. ఆడది బురఖా వేసుకుని తన మొగుడికే ముఖం చూపిస్తూ సంప్రదాయాలను పాటిస్తే పరాయి మొగోళ్ళువచ్చి మీద పడరు కదా. ఇకనైనా బుద్ధి తెచ్చుకుని మర్యాదగా బతుకు. మరోసారి నా కంట పడ్డావంటే నీ పని అధోగతే." బెదిరించింది మామా.
"ఇన్షా అల్లా అలాగే మామా" అంటూ నీరసంగా తలఊపింది గౌరి.
ఇక పనిలో పడిపోయింది. క్షణంకూడా తీరికలేని పని. తిండి లేకుండా, వంచిన నడుం ఎత్తకుండా చేయడం అసాధ్యమైపోయి శరీరం తూలుతోంది. కానీ మామా కొడుతుందేమోననే భయంతో అలాగే వుండిపోయింది. మేరీ దగ్గర వుంటే ఏదో ఒకటి తినడానికి ఇస్తుంది. కానీ ఆమె ఇప్పుడు పై అంతస్తులో పనిలో వుంది.

అర్జంట్ గా ఏదైనా తినకపోతే ప్రాణం నిలబడేట్టు లేదు. బాత్ రూంలో పడి వుండటమే మేలనిపిస్తోంది. పని చేస్తుంటే ఆకలి ఎక్కువవుతోంది. వంటింట్లోకి వెళ్ళాలంటే మామా చూస్తుందనే భయం. ఏమి చెయ్యాలి?

ఇంతలో కిటికీ దగ్గర అలికిడి. మెల్లగా పరదాలు కదిలాయి. ఎవరో చిన్నగా గుసగుసగా పిలుస్తున్నారు.

భయమేసింది. చేస్తున్న పని ఆపేసి కిటికీకున్న పరదాలను పక్కకి లాగింది.

అవతల డ్రైవర్ నిలబడి వున్నాడు.

'ఏంటి?' కళ్ళతోనే ప్రశ్నించింది గౌరి.

"ఇదిగో బాత్రూం లోకి వెళ్ళి తిను లేకపోతే చచ్చిపోతావ్" అంటూ సాండ్ విచ్ లున్న పొట్లం అందించి "భయపడకు. నీకు నేనున్నాను. అంత కష్టమైతే ఇద్దరం ఇక్కడ్నించి పారిపోదాం" అన్నాడు నవ్వుతూ.

కన్నీళ్ళు పొంగుకొచ్చాయి గౌరికి.

దేశం కాని దేశంలో ఆమాత్రం ఆప్యాయతకు నోచుకున్నందుకు సంతోషించింది. పొంగే కన్నీళ్ళను దిగమింగుకుంటూ ఒక సాండ్విచ్ కొరుక్కుని తినేసరికి ఊపిరివచ్చినట్లయింది. ఆకలి మనిషికి ఎంత నిస్సత్తువను కలగజేస్తుందో బాగా అర్థమయిందామెకు. ఇండియాలో ఇంటిదగ్గర ఎంతగా పేదరికంలో మగ్గిపోతున్నా ఆకలి అనేది ఎప్పుడూ ఎరగలేదు. వేళకు పచ్చడి మెతుకులైనా తినేది. ఇక్కడ కువైట్లో ఇదొక అనుభవం. బాధల పర్వం. ఈ ఊబిలోనుండి బతికి బయటపడుతుందా..

దాదాపూ నెలరోజులు అలాగే భారంగా గడిచాయి. తెలుగు డ్రైవర్ పేరు రాము అని అతను రైల్వే కోడూరు దగ్గరున్న ఒక పల్లెటూరునుండి వచ్చాడని తెలిసింది. అతను డ్రైవర్, మగవాడు కాబట్టి అతనికి కాస్త స్వేచ్ఛ వున్నట్లుంది. కానీ అప్పుడప్పుడూ తిట్లు, దెబ్బలూ మాత్రం తప్పవంట.

వచ్చి ఒక సంవత్సరమయిందట. రెండేళ్ళు ఎప్పుడు గడుస్తాయా ఇంటికి వెళ్ళిపోదామా అని ఎదురు చూస్తున్నానని చెప్పాడు. ఇద్దరి మధ్యా మాటలు ఎక్కువగా లేకపోయినా అపుడపుడూ చూపులు కలుసుకునేవి. మూగగా మాట్లాడుకునేవి. కళ్ళు ఆర్తిగా పరామర్శించుకునేవి. ఎందుకో అతనున్నాడన్న ధైర్యం కాస్త ఊరటను కలిగిస్తోంది. ఒకరికొకరు ఆసరాగా, ఆలంబనగా నిలవడానికే కదా దేవుడు స్త్రీ పురుషులను సృష్టించాడు.

వచ్చే శుక్రవారం ఇంట్లో పార్టీ వుంది. అతిథులు వస్తున్నారు. ప్రత్యేకంగా మంత్రిగారి భార్య షేకా వస్తోంది. అందుకోసం ఇల్లంతా సర్ది, కడిగి, తుడిచి కొత్తకార్పెట్లు పరిచి శుభ్రం చెయ్యాలంటూ హడావిడి చేసింది మామా. కార్పెట్లు మడిచి పైకెత్తడానికి, సోఫాలన్ని జరపి మూలల్లో శుభ్రం చేయడానికి రామూను కూడా లోపలికి పిలిచింది మామా.

ఇద్దరూ దగ్గరగా నిలబడి పనిచేస్తుంటే సంతోషంతో గాల్లో తేలిపోతున్నట్లుంది గౌరీకి. అలసట అసలు తెలియడంలేదు. రామూకు కూడా గౌరికి దగ్గరగా వుండటం ఎంతో ఆనందంగా వుంది. అపుడపుడూ కలుసుకునే చూపులు, తగిలే చేతివేళ్లు కొత్త లోకాలకు దారులు చూపిస్తున్నాయి.

అద్దాల అలమారా ముందుకు జరుపుతూ దాని బరువుకు తూలి పడబోయింది గౌరి. చటుక్కున చేతుల్తో ఆమెను పట్టుకుని అటూ ఇటూ చూసి బుగ్గమీద ముద్దు పెట్టేసాడు రాము. బుగ్గలు ఎర్రబడగా సిగ్గుపడింది గౌరి.

ఆత్మీయతతో కూడిన ముద్దులోని రుచి ఆమె హృదయంలోకి చేరి తనువులోని అణువణువునా ఆనందాన్ని నింపింది. ప్రేమతో అందించే ముద్దులేక, ఆప్యాయతలో హత్తుకునే ఆలింగనం లేక, అనురాగాన్ని వర్షించే మాట, స్పర్శ లేక ఎందరి స్త్రీ హృదయాలు ఒంటరిగా ఎడారిలో ఎండమావులై పోయాయో.

పరదేశంలో కాస్తంత ప్రేమకోసం, కష్టంలో రవంత ఆప్యాయత కోసం, కన్నీళ్లలో హత్తుకుని ఓదార్చే హృదయంకోసం  పరితపించే స్త్రీలను వ్యభిచారులనే ముద్ర వేసి వెక్కిరించి హేళన చేస్తుంది ఈ పవిత్ర పతివ్రతా సమాజం. పెదవులతో శ్రీరంగనీతులు వల్లించే వారికేం తెలుసు బాధలు, వ్యథలు, కష్టాలు, కన్నీళ్ళు. రాత్రయితే మల్లెపూలు పెట్టుకుని మొగుళ్ళ పక్కలోకి చేరే వీళ్ళకేం తెలుసు జీవితంలో ఓడిపోయి, సమస్తం కోల్పోయిన స్త్రీలు పరదేశంలో పైసల కోసంచేసే ఒంటరి పోరాటాలు.

అనుకున్నరోజు రానే వచ్చింది. అట్టహాసంగా పార్టీ మొదలయ్యింది. మగవాళ్ళంతా బయట తోటలో వున్న విడిది భవనంలో కూడుకున్నారు. స్త్రీలంతా లోపల వున్న స్త్రీల విడిది గదిలోకి విచ్చేసారు.

సంగీతం హోరెత్తిపోతోంది. విందు మొదలయ్యింది. తగిన వినోదం కూడా. బురఖాలన్నీ సోఫాల మీద విసిరిపారేసి స్త్రీలంతా బెల్లీ డాన్స్ చేయడం మొదలు పెట్టారు. వారి సౌందర్యాన్ని చూడటానికి సాటి స్త్రీలకే కళ్ళు సరిపోవు. వంపుసొంపులతో లావణ్యంతో అలరారే అద్భుతమైన అందగత్తెలు అరబిక్ స్త్రీలు. వచ్చిన షేకా కూడా ఉత్సాహంగా డేన్సు చేస్తోంది.

ఇంతలో కాలిచెప్పు తొణికి పాదం మడతపడింది షేకాకు. నొప్పితో బాధపడుతూ కూర్చుంది. ఆ సందడిలో ఆమెనెవరూ పట్టించుకోలేదు. అక్కడే టీలు, కాఫీలు అందిస్తున్న గౌరి గమనించి షేకా కాళ్ళ దగ్గర కూర్చుని పాదాలకు మర్దన చేయసాగింది. షేకా కొంచెం కోలుకుంది.

నవ్వుతూ గౌరివైపు చూసి "నజాత్ ఇటురా" అంటూ కేకేసింది.  గౌరి మామా పరిగెత్తుకుంటూ షేకా దగ్గరికి వచ్చింది.

"ఈ కద్దామా (పనిమనిషి) నాకు కావాలి. నాతో పంపించు. నువ్వు కొత్తవాళ్ళను చూసుకో" ఆజ్ఞాపించినట్లుగా

చెప్పింది.

మామా షేకా మాటను కాదనగలదా. లోపల మనసులో తిట్టుకుంటూ, బయటికి నవ్వుతూ "అలాగే షేకా, నీకు ఇది నచ్చితే తీసుకెళ్ళు. నీకంటేనా" అంది వినయంగా గౌరి మామ నజాత్.

షేకా నూరా రాజ కుటుంబానికి చెందినది. ఆమె ఒక రాణి. ఇల్లు ఇంద్రభవనంలా సంపదతో తులతూగుతోంది. గౌరిపైన ప్రత్యేకమైన అభిమానం కలిగిన షేకా గౌరికి పెద్దగా పనులేవీ అప్పగించలేదు. తన పర్సనల్ వ్యవహారాలు కొన్ని మాత్రమే అప్పగించింది. గౌరి వుండటానికి ఒక రూం ఇచ్చి సకల సౌకర్యాలనూ కల్పించింది. ముందు మామా ఇచ్చిన జీతంకంటే పదిరెట్లు మిన్నగా జీతాన్ని గౌరికి ఇస్తానంది షేకా. ఇక్కడ తిన్నంత తిండి. పండ్లూ పాలూ పౌష్టికాహారం, దేనికీ కొదవలేదు. గౌరి తన అదృష్టాన్ని ఇంకా నమ్మలేక పోతోంది.

ఇన్నిరోజులూ ఆ ఇంట్లో పడిన కష్టాలు కలగా అనిపిస్తున్నాయి. గౌరి జీవితం మంచిమలుపు తిరిగింది. మనిషి కడుపునిండా తిండితో, కంటినిండా నిద్రతో, మంచి ఆరోగ్యంతో నున్నగా మెరిసిపోతోంది. అంతకుమించి అక్కడ ఉన్నట్లు తిట్లూ, దెబ్బలూ లేవు. అక్కడ రామూ ఎలా వున్నాడోననే దిగులు తప్ప వేరే ఏ బాధా లేదామెకు.

ఒకరోజు రంజాన్ పండుగలో మామా వంటలేవో వండి ఇస్తే షేకాకు ఇవ్వడానికి రామూ వచ్చాడు. అవి అందుకోవడానికి గౌరీనే బయటికి వెళ్ళింది. కొన్ని నెలల తరువాత రామూను చూసిన గౌరి కన్నీళ్ళు పెట్టుకుంది. రెండేళ్ళ కాంటాక్ట్ అయిపోగానే షేకాకు చెప్పి ఇక్కడికే డ్రైవర్ గా పిలిపిస్తానని చెప్పింది గౌరి.

"మరి మన పెళ్ళెప్పుడు?" చిలిపిగా ప్రశ్నించాడు రాము.

అందంగా సిగ్గుపడింది గౌరి.

"నాకు భర్త చనిపోయాడని ఇంటిదగ్గర ఒక పాప వుందని తెలిసే ఈ మాట అంటున్నావా రామూ" ఆవేదనగా ప్రశ్నించింది గౌరి.

"అయితే ఏం గౌరి? నీ జీవితం ఏ సుఖమూ లేకుండా ఇలా ఒంటరిగా గడిచిపోవాలా. నీకంటే మంచిఅమ్మాయి నాకు దొరుకుతుందంటావా. నిన్ను చేసుకుంటే నేను అదృష్టవంతుడ్ని అవుతాను." మన:స్ఫూర్తిగా చెప్పాడు రాము ఆమె చేతిని గట్టిగా పట్టుకుంటూ.

ఆ తరువాత గౌరి, రామును ఆ ఇంట్లోకే డ్రైవర్ వీసాపై పిలవడం, ఇద్దరి ప్రేమనూ అంగీకరించిన షేకా వారిద్దరికీ కువైట్ లోనే పెళ్ళి చేయడం జరిగిపోయాయి. గౌరి, రాము ఇద్దరు పిల్లల్ని కూడా అక్కడే కన్నారు.

దాదాపు వందమందిని ఇండియానుండి పిలిపించి షేకా ఇంట్లోనే కాదు షేకా బంధువుల ఇంట్లో కూడా పనికి కుదిర్చారు.

ఆ విధంగా గౌరి ఎన్నో జీవితాల్లో వెలుగులను నింపింది. చాలామందికి సహాయం చేసి ఊరిలోనూ, బంధువుల్లోనూ, మంచి పేరును కూడా సంపాదించుకుంది. దాదాపూ ఇరవైయేళ్ళు అక్కడే గడిచాక "వయసయిపోతోంది మేమిక ఇంటికి వెళ్ళిపోతాం" అన్నా కూడా షేకా ఒప్పుకోలేదు.

"మీరు ఇండియాకు వెళ్ళడం ఎందుకు. మీరు పనేమీ చెయ్యద్దు. అన్ని సౌకర్యాలూ మీకు కల్పిస్తాను. పిల్లలను ఇక్కడే కాలేజీలో చేర్పించి చదివిస్తాను. నా ప్రాణం వున్నంతవరకూ ఇక్కడే వుండండి. తరువాత మీ ఇష్టం" అంది షేకా.

ముందున్న మామా ఇంట్లోనే తను ఇంకొన్ని నెలలు వుండివుంటే షేకా వచ్చి తనను ఇక్కడికి తీసుకురాకపోతే తన జీవితం ఎలా వుండేదో.. తలచుకుంటేనే ఇప్పటికీ భయమేస్తోంది గౌరీకి.

ఎడారిలో ఒయాసిస్సుల్లా షేకా లాంటి దయార్ద్రహృదయులు నూటికో కోటికో ఒకరు వుంటారు అనుకుంటూ కృతజ్ఞతతో ఆమె గొప్పమనసుకు నమస్కరించారు ఇద్దరూ.

ఇప్పటికీ గౌరి కుటుంబం కువైట్లోనే చీకూ, చింతా లేకుండా కాలాన్ని సంతోషంగా గడుపుతున్నారు.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments